క్లుప్తంగా

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

జంగారెడ్డిగూడెం: హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో వాహనదారులు ప్రాణహాని నుంచి తప్పించుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని విద్యార్థులు అన్నారు. శుక్రవారం జంగారెడ్డిగూడెంలో శుక్రవారం త్రివేణీ డిగ్రీ కళాశాల విద్యార్థులు దీనిపై ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. నృత్యాలు, ప్రదర్శనతో హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. మద్యం, మత్తు పదార్థాలు సేవించి, మొబైల్స్ వాడుతూ వాహనాలు నడపరాదని కోరారు. సహకరించిన కళాశాల యాజమాన్యం హనుమర మురళీమోహన్ రావు, అకాడమిక్ డైరెక్టర్ ఫనిష్ రామ్‌కు విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన జంగారెడ్డిగూడెం పట్టణ ఎస్సై సాగర్ బాబు, హోండా షోరూం అధినేత తడికమళ్ళ రాజశేఖర్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ దాకారపు కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పోలీస్ సర్కిల్ పరిధిలోని జంగారెడ్డిగూడెం, ఏజెన్సీ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా పగటి ఇంటి దొంగతనాలు పెరిగాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జంగారెడ్డిగూడెం క్రైమ్ విభాగ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఇంటి నుంచి బయటకు వెళ్లే వారు గేటు తాళాలు లోపలివైపు వేసుకోవాలని సూచించారు. విలువైన వస్తువులు జాగ్రత్త చేసుకోవాలని, స్థోమత ఉన్న వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. 18వ తేదీ శివరాత్రి సందర్భంగా ఇంటి నుంచి బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకి వచ్చిన వారు ఎక్కువగా తిరుగుతున్నారని, అనుమానం ఉన్నవారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన సదస్సు

జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి శివాజీ త్రిశత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనాన్షియల్ లిటరసీ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జి కొత్తపల్లి కోటక్ మహేంద్ర బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కే. బ్రహ్మానాయుడు మాట్లాడుతూ బ్యాంకు సేవలను వివరించారు. బ్యాంకు సిబ్బంది పి.సురేష్, అధ్యాపకులు బి.శ్రీనివాసరావు, కె.ఉత్తమ్‌సాగర్, జి.శ్రీనివాసరావు, సీహెచ్ రమాదేవి, వి.హనుమంతరావు, కె.వి.వి. శిరీష పాల్గొన్నారు.

గోమాతకు ఆపన్న హస్తం

జంగారెడ్డిగూడెం: పురిటి కష్టాలతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న గోమాతను జంగారెడ్డిగూడెం యాక్సిస్ బ్యాంకు సిబ్బంది ఆస్పత్రికి తరలించి రక్షించారు. శుక్రవారం ఉదయం ఒక గోవు (ఆవు) ఈని ఆరోగ్యం క్షీణించి బాధపడుతూ స్థానిక యాక్సిస్ బ్యాంకు సమీపంలో కూలబడి ఉంది. దీనావస్థలో ఉన్న ఆవును బ్యాంకు సిబ్బంది గుర్తించి, వాహనంలో పశువైద్యశాలకు తరలించారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు సహకారంతో ఆవుకు దాణా అందించారు. పశువైద్యశాల వైద్యులు ఆవుకు చికిత్స అందించారు. విశ్వహిందూపరిషత్ సభ్యులు కె.వి.ఆర్.సత్యనారాయణ యాక్సిస్ బ్యాంక్ సిబ్బందికి అభినందనలు తెలియజేసి గోమాత ఫొటో అందజేశారు. ఈ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంకు సిబ్బందితో పాటు, పరిషత్ సభ్యులు కొనకళ్ళ వెంకటేశ్వరరావు, కొంచాడ దుర్గాప్రసాద్, వీరవల్లి శ్రీనివాస్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వంగ రైతులను ఆదుకోవాలి

ద్వారకాతిరుమల: మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్న వంగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. మండలంలోని పంగిడిగూడెంలో రైతు సంఘ నాయకులు శుక్రవారం పర్యటించి, వంగ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వంగ రైతులతో మాట్లాడి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలి ఖర్చులు రాకపోవడంతో రైతులు వంగ పంటను కోయడం లేదన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు కట్టా భాస్కరరావు, గుర్రం రాంబాబు, గుర్రం పాపారావు తదితరులున్నారు.

అధికార యంత్రాంగం పర్యవేక్షణ

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు పట్టిసం రేవులో మకాం వేసి పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్, ఆర్డీవో ఝాన్సీరాణి ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు వారు చేపట్టే పనులపై పర్యవేక్షణ చేస్తున్నారు. పోలవరం డీఎస్పీ కె.లతాకుమారి, తహసీల్దార్ బి.సుమతి, సీఐ కె.విజయ్‌బాబు, ఎస్సై ఎస్.పవన్‌కుమార్, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, పంచాయతీ కార్యదర్శి టి.విజయకుమారి, దేవస్థానం ఈవో ఎస్.సంగమేశ్వర శర్మ పటిష్టంగా ఏర్పా ట్లు చేపట్టారు. గూటాల ఎత్తిపోతల నుంచి బంగారంపేట వరకు ఏటిగట్టు రోడ్డుపై లైటింగ్ సమస్య ఏర్పడటంతో చీకట్లోనే భక్తులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. శివక్షేత్రం వద్ద కొంతమేర విద్యుత్ సౌకర్యం లేదని ఫిర్యాదులు రావడంతో సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు సన్నద్ధం


ఉత్సవ కమిటీ సభ్యులతో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్సై సాగర్‌బాబు


బుట్టాయగూడెం శివాలయంలో స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు


టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెం చంద్రశేఖర స్వామికి లక్షబిల్వార్చన

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని తాడువాయి భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి క్షేత్రంలో ఈనెల 18 మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 5 రోజుల పాటు కల్యాణ మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి జంగారెడ్డిగూడెం ఎస్సై సాగర్‌బాబు పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్‌శాఖ ద్వారా భద్రతాపరమైన చర్యలు చేబడుతున్నామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. క్షేత్రానికి వచ్చే ప్రతి ఒక్కరూ కమిటీ సభ్యులకు సహకరించాలన్నారు. ఉత్సవ నిర్వాహకులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు సత్రం లక్ష్మణరావు మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పాపోలు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 18న శివరాత్రి రోజున స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, 19న శ్రీభద్రకాళి సమేత వీరేశ్వర స్వామి గ్రామోత్సవం, 20న స్వామి, అమ్మవార్ల కల్యాణం, అన్నసమారాధన కార్యక్రమం, 21న అపర్ణా సమేత అనంతేశ్వర స్వామి వారి కల్యాణం, 22న స్వామి, అమ్మవార్లకు శ్రీపుష్పయాగం(పవళింపు సేవ) వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లా గంగాధరరావు, ఓరుగంటి నాగేంద్ర, పాలా రామకృష్ణ, పిన్నమనేని షణ్ముఖరావు, పాపోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

బుట్టాయగూడెం: స్థానిక శివాలయంలో శివరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం నుంచి గురువారం వరకూ శివరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం స్వామివారి అభిషేక కార్యక్రమాలతో పాటు విశేష పూజలు నిర్వహిస్తామని చెప్పారు. చివరిరోజున మహా అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల చిట్టిరాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు గొట్టుముక్కల మల్లికార్జున, భక్తులు కొండేపాటి రామకృష్ణ, పాల్గొన్నారు.

భ్రమరాంబ మల్లన్న కల్యాణోత్సవం

కొయ్యలగూడెం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పులివాగు శివాలయంగా పిలవబడే భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ధర్మకర్తల వంశీకులు స్వామివారి కల్యాణోత్సవాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. కొయ్యలగూడెం మండల వ్యాప్తంగా ఐదు ప్రధాన శైవ క్షేత్రాలోట్ల శనివారం శివరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

భారీ పోలీసు బందోబస్తు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలం తాడువాయిలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్ బాబు తెలిపారు. డీఎస్పీ కేవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సీఐ ఎం.బాల సురేష్‌బాబు పర్యవేక్షణలో పట్టణ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, మహిళా పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ, పట్టణ, ట్రాఫిక్ ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 20మంది సిబ్బంది, మరో 20 మంది మహిళా పోలీసులతో సుమారు 50మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

కొనసాగుతున్న శివరాత్రి ఉత్సవాలు

టి.నరసాపురం: శివరాత్రి ఉత్సవాలు మండలంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మక్కినవారిగూడెం భువనేశ్వరి సమేత చంద్రశేఖర స్వామికి లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టి.నరసాపురం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలను నిర్వహించారు.

నూకాలమ్మకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో నూకాలమ్మ వారికి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు, మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలను అర్చకులు మనోజ్ శర్మ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ 18వ తేదీన శివరాత్రి సందర్భంగా ఆలయంలో కొలువైన నర్మదా అమృత బాణ లింగేశ్వర స్వామికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మేకపోతు బలి కలకలం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం టౌన్‌షిప్‌లోని పార్క్‌లో మేకపోతు బలి కలకలం సృష్టించింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఈ నెల 12న చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అదే ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి కలలో పార్కులో అమ్మవారి గుడి కట్టాలని సూచన వచ్చినట్లుగా పేర్కొంటూ పార్కులో ఒక రాయిని అమ్మవారిగా భావిస్తూ చిన్న పాక వేసి పూజలు చేస్తున్నారు. ఈ నెల 12న అక్కడ మేకపోతును బలి ఇవ్వడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు, సిబ్బంది వచ్చి పాకను తొలగించారు. అప్పటి నుంచి నేటి వరకు ఆ ప్రాంతంలో సదరు వ్యక్తులు కొబ్బరి కాయలు కొడుతూ పూజలు నిర్వహిస్తున్నారని టౌన్‌షిప్ వాసులు పేర్కొంటున్నారు.

ప్రతి కుటుంబాన్నీ పలకరించండి


చింతపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా


హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

- ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పిలుపు
- చింతపూడిలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ

చింతలపూడి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో గృహసారథుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. స్థానిక షాదీఖానాలో శుక్రవారం 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమంలో భాగంగా సచివాలయాల మండల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పాలనను వివరించేందుకు ప్రతి కుటుంబాన్ని పలకరించాలని పిలుపునిచ్చారు. ప్రజలను కలిసి అభివృద్ధి పనులపై అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రజలను ఓట్లు అడిగే హక్కు వైసీపీకి మాత్రమే ఉందని అన్నారు. రాబోయే 14 నెలల కాలం ఎంతో విలువైందని, వైఎస్సార్‌సీపీ విజయానికి కష్టపడి పనిచేయాలని సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు సూచించారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. మార్చి 18 నుంచి కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమవుతుందని తెలిపారు. పథకాలు అందని లబ్ధిదారుల వివరాలు సేకరించి అధికారుల దృష్టికి తీసుకువచ్చి వారికి కూడా పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రబాబు, ఎల్లో మీడియా కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలు గెలుపొందేలా గృహసారథులు పని చేయబోతున్నారని తెలిపారు. సచివాలయాల కన్వీనర్లకు, గృహసారథుల బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ డా బి రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, సచివాలయాల కన్వీనర్ టి శ్రీనివాసరావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎస్ దుర్గారావు, సొసైటీ ఛైర్మన్లు ఎ సుబ్బారావు, అలవాల బాబు, చుండూరి నాగేశ్వరరావు, పట్టణ వైసీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గవరవరంలో తాగునీటి ఎద్దడి

కొయ్యలగూడెం: గవరవరం పంచాయతీలో రెండు రోజుల నుంచి తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ సిబ్బందికి జీతభత్యాలు చెల్లించకపోవడంతో వారంతా విధులను బహిష్కరించారు. వాటర్ ట్యాంక్ పంపు హౌస్‌కి తాళం వేసి సిబ్బంది నిరసన వ్యక్తం చేయడంతో ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్తులు తెలిపారు. గవరవరంతో పాటు చొప్ప రామన్నగూడెంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని గ్రామస్తులు, మాజీ సర్పంచ్ ఎం.రాజ్‌కుమార్ తదితరులు కోరుతున్నారు.

ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించాలి

కొయ్యలగూడెం: చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఐ నాయకులు కోరారు. శుక్రవారం మండలంలోని మంగపతిదేవీపేటలో చింతపూడి ఎత్తిపోతల కాలువ పనులు నిర్వహించే ప్రదేశంలో వారు నిరసన తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, సర్పంచ్ అబ్బు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పన్నుల వసూలు

జంగారెడ్డిగూడెం: పన్నుల వసూళ్ల కార్యక్రమం ఐదో రోజు జంగారెడ్డిగూడెం పట్టణంలో కొనసాగింది. మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ మాట్లాడుతూ మొండి బకాయిదారుల ఇంటికి వెళ్లి పన్నుల విషయం తెలిపి, చెల్లించాలని కోరారు. దీనికి స్పందించిన బకాయిదారులు రూ. 12లక్షలు నగదు రూపంలో, రూ. 2లక్షలు చెక్కు రూపంలో పన్నులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎన్. సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నవజాత శిశువు మృతదేహం లభ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక అంబికా రెస్టారెంట్ రోడ్డులో హైదరాబాద్‌లో నివశిస్తున్న సురేష్‌కు చెందిన శిథిలావస్థలో చేరిన ఇంట్లో నవజాత శిశువు మృతదేహాన్ని గుర్తించారు. సురేష్ హైదరాబాద్‌లో ఉండటంతో రెండేళ్లుగా ఆ ఇల్లు ఖాళీగా ఉంది. శుక్రవారం సురేష్ వచ్చి ఇంటి ఆవరణను శుభ్రం చేస్తుండగా వంటగదిలో వాష్ బేసిన్‌లో కుళ్లిన నవజాత శిశువు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఎం.సాగర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుళ్లిన నవజాత శిశువు మృతదేహాన్ని 10 రోజుల క్రితం పడవేసి ఉంటారని భావిస్తున్నారు. ఘటనపై చుట్టుపక్కల వారి నుంచి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

బ్యాంకు ఖాతాదారులకు సత్కారం

పోలవరం రూరల్: బ్యాంకు సేవల వినియోగదారులకు సంధ్యా శిబిరాల అవగాహన ఎంతో అవసరమని భారతీయ స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాజశేఖరం అన్నారు. గురువారం ఎస్బీఐ పోలవరం వ్యవసాయ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా పోలవరం మండలం గుంజవరం, చేగొండపల్లిలో ప్రజలకు, డ్వాక్రా మహిళలకు, బ్యాంక్ సేవల వినియోగదారులకు సంధ్యాశిబిరం నిర్వహించారు. పోలవరం బ్రాంచ్ మేనేజర్ ఎస్.నవీన్‌కుమార్ ఉత్తమ రైతులను, రుణాలు సక్రమంగా చెల్లిస్తున్న డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులను ఘనంగా సన్మానించారు.

మహా యజ్ఞానికి శ్రీకారం

- హోమగుండం వద్ద గణపతి పూజ
- నేడు సుందరగిరిపై మహా సంపుటిత శ్రీ లక్ష్మీనృసింహ ధన్వంతరీ యజ్ఞం

ద్వారకాతిరుమల: సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించనున్న మహా సంపుటిత శ్రీ లక్ష్మీనృసింహ ధన్వంతరీ 28వ మహాయజ్ఞానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా మహా శివరాత్రి రోజున సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకూ ఈ యజ్ఞాన్ని ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ యజ్ఞ ఏర్పాట్లను సీహెచ్.కుటుంబరావు పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఆలయ యాగశాలలో భారీ ఏర్పాట్లు చేశారు. అభిషేకం నిమిత్తం 1,331 కలశాలను సిద్ధం చేశారు. వివిధ రకాల శాలి గ్రామాలను పూజలకు సన్నద్ధం చేశారు. వివిధ దేవతామూర్తుల విగ్రహాలను యజ్ఞ నిర్వహణ ప్రాంగణంలో ఉంచారు. యజ్ఞ క్రతువులో భాగంగా రుత్వికులు ఆలయ గర్భాలయంలో కొలువైన స్వామివారి మూలవిరాట్ వద్ద కంకణధారణ చేశారు. అనంతరం గురూజీ గణపతి పూజ, హోమం నిర్వహించారు. శాలిగ్రామారాధన, కలశ ప్రతిష్ఠాపన, సూర్యనమస్కారాలు, లక్ష తులసీ దళార్చన చేశారు. శనివారం రాత్రి లోక శాంతి కోసం నిర్వహించనున్న ఈ యజ్ఞం భక్తులను పరవశింప జేయనుంది. ఈ యజ్ఞ క్రతువును యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించవచ్చని కమిటీ సభ్యులు తెలిపారు.


హోమం నిర్వహిస్తున్న గురూజీ

పంటల వివరాలను ఈ-కేవైసీలో నమోదు చేసుకోవాలి

బుట్టాయగూడెం: రైతులు తప్పనిసరిగా తమ పంట వివరాలను ఈ-కేవైసీలో ఈ నెల 25వ తేదీలోపు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వై. రామకృష్ణ అన్నారు. మండలంలోని బూసరాజుపల్లి సమీపంలో ఉన్న రైతు పైడా జయరాజు మొక్కజొన్న పంటను, బుద్దులవారిగూడెం, కొల్లాయిగూడెంలోని కేరం వసంతరావు, కేరం కన్నయ్యల పంట పొలాల్లోని మొక్కజొన్న, పొగాకు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారి సాగు విస్తీర్ణం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పంటల సాగు విస్తీర్ణం, ఈ-కేవైసీ నమోదు వివరాలను తెలుసుకునేందుకు పర్యటించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా రైతులు 47 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఈ మొక్కజొన్న పంటలకు సంబంధించి పంటల్లో చీడ పీడలు అదుపులోనే ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం పంటలు ఆశాజనకంగానే ఉన్నాయని చెప్పారు. నీటి యద్దడి కూడా లేదని అన్నారు. 1,28,000 ఎకరాల్లో రబీలో రైతులు వరి పంటను సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల తాను భీమడోలు, తదితర ప్రాంతాల్లో పర్యటించినప్పుడు వరి పంటను అక్కడక్కడ కాండం తొలిచే పురుగు, ఆకుమడత పురుగులు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. వాటి నివారణకు రైతులకు తగు సలహాలు, సూచనలు అందించామని చెప్పారు. జిల్లాలో 540 రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు వివిధ సేవలను అందిస్తున్నామన్నారు. ఎరువులు, పురుగు మందులతో పాటు వ్యవసాయ పనిముట్లను అర్హులైన రైతులకు అందజేస్తున్నట్టు తెలిపారు. 427 రైతు భరోసా కేంద్రాల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. కొన్ని ఇప్పటికే ప్రారంభం కాగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఏఓ బి. సుమలత మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలంలో 11148.41 ఎకరాల విస్తీర్ణంలో ఆర్‌బీకే సిబ్బంది ఈ-పంట నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు మౌనిక, పాల్గొన్నారు.


బూసరాజుపల్లి సమీపంలో పంటల వివరాలను అడిగి తెలుసుకుంటున్న వ్యవసాయ అధికారి

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవ ఆహ్వాన పత్రాల ఆవిష్కరణ

కొయ్యలగూడెం: స్వయంభు శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ మదన గోపాల స్వామి ఆలయ ప్రారంభోత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవ కరపత్రాల విడుదల కార్యక్రమం ఆలయంలో శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో విడుదల చేసిన బ్రోచర్లను పంపిణీ చేశారు. ఈనెల 27 నుంచి మార్చి 6వ తేదీ వరకు ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మార్చి 1వ తేదీ దేవేరులతో సహా స్వామి వారిని అదేవిధంగా ఉపాలయాల్లో లక్ష్మీనరసింహ స్వామి, వేంకటేశ్వర స్వామి, విగ్రహాలను ధ్వజస్తంభ, ప్రతిష్ఠాపన, ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభయాంజనేయ, గరుడ, విశ్వక్సేన విగ్రహాలను కూడా ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. దశావతారాలను, అష్టలక్ష్మీ విగ్రహాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 6వ తేదీ చక్రస్నానం, పూర్ణాహుతి, పుష్పఉత్సవం, ద్వాదశ ప్రదక్షణలతో ఉత్సవ కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. చిరవూరు శ్రీనివాస్, బొమ్మ బాబు, ఉమా స్టూడియో శాస్త్రి, నిడదవోలు రామారావు, వీరభద్రరావు, ఫణి, అన్నవరం, దుర్గారావు, బొమ్మ దుర్గబాబు, శివ, మడుతూరి ఆదినారాయణ, దుర్గారావు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శుక్రవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. భీమడోలుకు చెందిన గుండాబత్తుల సత్యన్నారాయణమూర్తి దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

జగనన్న లేఅవుట్‌లో మంచినీటి బోరు ప్రారంభం

లింగపాలెం: అయ్యపరాజుగూడెం జగనన్న లేఅవుట్ వన్‌లో మంచినీటి బోరును ఉప సర్పంచ్, మండల వైసీపీ సచివాలయ ఇన్‌చార్జి అన్నపనేని శాంతరావు ప్రారంభించారు. ఈ లేఅవుట్‌లో సుమారు రూ. 5లక్షల వ్యయంతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన మంచినీరు బోరు, మోటార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతారావు మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ముందుగానే అన్ని సదుపాయాలను కల్పిస్తోందన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని శాంతరావు కోరారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు చీదరాల ప్రసాద్, జి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


అయ్యపరాజుగూడెంలో మంచినీటి బోరును ప్రారంభించిన ఉపసర్పంచ్ శాంతరావు

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించాలి

టి.నరసాపురం: ఎరువులు, పురుగు మందులు అవసరం మేరకే వినియోగించాలని తద్వారా సేద్యం ఖర్చును రూ.5 నుంచి రూ.7వేల వరకు తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయఅధికారి డి.ముత్యాలరావు సూచించారు. మండలంలోని రాజుపోతేపల్లి, తెడ్లం గ్రామాల్లో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఏవో రైతులతో కలిసి మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించారు. ఎక్కువ దిగుబడి కోసం ఎరువులు, పురుగు మందులు మోతాదుకు మించి వినియోగిస్తున్నారని వివరించారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడం కోసం మెళకువలను, సూచనలను రైతులకు అందించారు. ప్రకృతిలో వ్యవసాయానికి ఉపయోగపడే రైతు నేస్తాలైన మిత్ర పురుగులు ఎక్కువగా ఉన్నాయని, పురుగు మందులు ఎక్కువగా పిచికారీ చేయడం వల్ల అవి చనిపోతాయని వివరించారు. వ్యవసాయ గ్రామ సహాయకులు టి.స్వప్న, పలువురు రైతులు పాల్గొన్నారు.